క్లుప్తంగా

గర్భిణులకు పరీక్షలు



అలంపూర్ రూరల్: క్యాతూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణులకు మంగళవారం పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, బరువు, వివిధ పరీక్షలు చేశారు. 102 వాహనంలో గర్భిణులను పీహెచ్‌సీకి తీసుకెళ్లి పరీక్షల అనంతరం తిరిగి ఇంటికి తరలిస్తున్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యులు సూచించారు. అదేవిధంగా న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



కేటీదొడ్డి: ట్రాఫిక్ నిబంధనలు వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని హెడ్‌కానిస్టేబుల్ రఘునాథం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులకు రోడ్డు నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలన్నారు. తనిఖీల్లో పట్టుబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది వాహనాదారులు ఉన్నారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ



మానవపాడు: వేసవికాలం సమీపిస్తుండటంతో నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంపీడీఓ రమణారావు అన్నారు. మంగళవారం మండలంలోని జల్లాపురం, చందూరు గ్రామాలలోని నర్సరీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి నర్సరీల్లో షెడ్ నెట్‌లను ఏర్పాటే చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిర్వాసితుల ఆందోళన

గట్టు: మండలంలోని చిన్నోనిపల్లె భూ నిర్వాసిత రైతుల ఆందోళన మంగళవారం కొనసాగింది. చిన్నోనిపల్లె గ్రామం దగ్గర చాగదోన, చిన్నోనిపల్లె, లింగాపురం, ఇందువాసి, బోయలగూడెం గ్రామాలకు చెందిన భూ నిర్వాసిత రైతులు ఆందోళనలో పాల్గొని నినాదాలు చేశారు. 403 రోజులుగా నిరసన తెలుపుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అధిక సంఖ్యలో తరలిరావాలి

ధరూరు: నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు గోవిందు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే ముఖ్య కార్యకర్తల సమావేశానికి జిల్లా చైర్మన్ గొంగ్ల రంజిత్ కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు. మండలం నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

అంబులెన్స్ వితరణ



ఆత్మకూర్: కేబీఎస్ బ్యాంకు 22వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆత్మకూర్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు రూ.18 లక్షలతో అంబులెన్స్‌ను వితరణగా అందించి ఔదార్యం చాటుకున్నారు. మంగళవారం కేబీఎస్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో మల్టీయాలిటీ అంబులెన్స్ తాళాన్ని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ల జిల్లా సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ అందజేశారు. ఈసందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కేబీఎస్ బ్యాంకుల ఆధ్వర్యంలో సామాజిక సేవ, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కేబీఎస్ జనరల్ మేనేజర్ సత్యనారాయణ, సీఎఫ్ఓ మురళీకృష్ణ, సీసీఓ మహేశ్వర్లు, డీజీఎంఐటీ రాజు, ఏజీఎం ప్రసాద్, బ్రాంచ్‌మేనేజరు సతీష్‌రెడ్డి, వైద్యులు హరినారాయణ, నిస్సార్‌అహ్మద్, శబరి, బ్యాంకు, వైద్యసిబ్బంది ఉన్నారు.

పర్యవేక్షణ ఏదీ?

- రెండు రోజుల్లో 55 మొక్కలు దగ్ధం
- పట్టించుకోని అధికారులు



డి.బూడిదపాడు భైరాపురం రహదారిలో ..



ఉండవెల్లిలో కాలుతున్న మొక్కలు

ఉండవెల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో నాటిన మొక్కలను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రులు, రాష్ట్ర అధికారులు ఆదేశించిన క్షేత్రస్థాయిలో అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదు. పాలకులు ఊకదంపుడు ఉపన్యాసాలకే పరిమితం అయినట్లు స్పష్టంగా కనబడుతోంది. మండలంలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు అగ్నికి ఆహుతి అవుతున్నా మండల అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు రోజుల్లో వేర్వేరు చోట్ల 52 వరకు మొక్కలు కాలి బూడిద అయ్యాయని పలు గ్రామాల ప్రజలు తెలిపారు. ఉండవెల్లి మండలంలో 25 మొక్కలు అగ్నికి ఆహుతి అయ్యాయి. సోమవారం ఈ బుడిదపాడు నుంచి భైరాపురం మార్గంలో 27 మొక్కలు కాలాయి. అయిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

మొక్కలు దగ్ధం

రోడ్డుకు ఇరువైపుల నాటిన మొక్కల పక్కల ఉన్న గడ్డికి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టడంతో అది కాస్తా విస్తరించుకుంటూ హరితహారంలో నాటిన మొక్కలకు అంటుకుంది. కాండం వరకు కాలడంతో మొక్క బతికేస్థితిలో లేదు. ప్రతి సంవత్సరం మొక్కలు అగ్నికి ఆహుతి అవుతున్నా అధికారుల పర్యవేక్షణ కరువైంది.

మొక్కలను కాపాడాలి



ప్రతి మొక్కను కాపాడేందుకు వన సేవకులను ఏర్పాటు చేశారు. కాని రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలపై పర్యవేక్షణ లేదు. మొక్క పాదుకల వద్ద గడ్డి ఏపుగా పెరగడంతో కొందరు నిప్పు పెట్టుతున్నారు. అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. మొక్కలను నాటిన ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోంది.

–రేఖ, సర్పంచు, ఉండవెల్లి

నిప్పపెట్టిన వారిపై చర్యలు

మండలంలో నాటిన ప్రతి మొక్కను కాపాడుతున్నాం. నియోజక వర్గంలో 3 లక్షల మొక్కలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. మొక్కలను నిప్పు పెట్టిన వారిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారులకు సమాచారం అందించాం. త్వరలో ప్రతిపాదనలు పంపిస్తాం.

– నాగేంద్రం, డిప్యూటీ డీఆర్‌డీఓ

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

అలంపూర్: మెడికో విద్యార్థిని ప్రీతి మృతికి కారణమైన నిందితుడిని తక్షణమే కఠినంగా శిక్షించాలని యూత్ ఫర్ పబ్లిక్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్‌వీ శేషు డిమాండ్ చేశారు. మంగళవారం అలంపూర్ చౌరస్తాలో యూత్ ఫర్ పబ్లిక్ సేవా సమితి ఆధ్వర్యంలో వరంగల్ పీజీ విద్యార్థిని ప్రీతి మృతికి సంతాపంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. చౌరస్తా కూడలిలో ప్రీతి చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రీతికి న్యాయం చేయాలని నినదించారు. అనంతరం ఆర్‌వీ శేషు మాట్లాడుతూ నిందితుడు సైఫ్ ను బహిరంగంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో విశ్వశాంతి, వైష్ణవి కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అలంపూర్: రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ పీజీ మెడికల్ విద్యార్థిని ప్రీతి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీనియర్ విద్యార్థి సైఫ్ వేధింపులు భరించలేక మెడికో విద్యార్థిని మృతి చెందడం బాధాకరమని నిందితుడి కఠినంగా శిక్షించాలని కోరారు. విద్యా సంస్థల్లో ర్యాగింగ్ నిరోధానికి పర్యవేక్ష కమిటీలు, కౌన్సెలింగ్ కేంద్రాలు, టోల్‌ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు.

కొనసాగుతున్న కంటి వెలుగు



అలంపూర్‌లో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



సంకాపురంలో ..

అలంపూర్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులోని జెడ్పీహెచ్‌ఎస్ (హరిజనవాడ)లో మంగళవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు క్యాంపులో 73 మంది పురుషులు, 82 మంది మహిళలు మొత్తం 155 మంది పరీక్షలు చేసుకున్నారు. 56 మందికి కళ్ల అద్దాలు, 11 మందికి ఆన్‌లైన్‌లో రిఫర్ చేశారు. క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలోని లింగన్‌వాయిలో 68 మంది పురుషులు, 61 మంది మహిళలు మొత్తం 129 మంది పరీక్షలు చేయించుకున్నారు. ఒక్కరిని ఆపరేషన్ నిమిత్తం రెఫర్ చేశారు. కార్యక్రమంలో కంటి వెలుగు పర్యవేక్షణ అధికారి డాక్టర్ ప్రసూనరాణి, డాక్టర్ హేమమానస, డాక్టర్ రామస్వామి, మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్, హెచ్‌ఏ బాలీశ్వరయ్య, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అయిజ: మండలంలోని సంకాపురంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు కేంద్రాన్ని మంగళవారం సంకాపురం సర్పంచ్ సుజాత ప్రారంభించారు. పంచాయతీలో ఐదు రోజుల పాటు శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఈశ్వర్, పంచాయతీ కార్యదర్శి వీరేష్, వార్డు సభ్యులు నాగరాజు, ఈశ్వర్‌గౌడ్, రాముడు, నాగమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీవాల ఆరోగ్యంపై జాగ్రత్తలు



పాల్వాయిలో గొర్రెలకు మందులు వేస్తున్న వెటర్నరీ వైద్యుడు

మల్దకల్: జీవాల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకుంటున్నామని డాక్టర్ యామినిసాయి అన్నారు. మంగళవారం మండలంలోని పాల్వాయి, మల్దకల్, మద్దెలబండ గ్రామాలలో గొర్రెలకు ఉచిత నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యామినిసాయి మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు నట్టల మందులను తప్పనిసరిగా తాపించాలన్నారు. అలాగే సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం ఆయా గ్రామాలలో మొత్తం 8486 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను వేశారు. కార్యక్రమంలో సర్పంచులు శివరామిరెడ్డి, యాకోబు, జయమ్మ, పశు వైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, రాజేంద్ర, రామాంజనేయులు, మధు తదితరులు పాల్గొన్నారు.

అయిజ: గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు తప్పనిసరిగా వేయించాలని వెటర్నీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ స్వరూప రాణి కోరారు. బుధవారం మండలంలోని ఎక్లాస్‌పురం, తూంకుంట గ్రామాల్లో సిబ్బంది మొత్తం 9870 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను వేశారు. గురువారం అయిజ పట్టణంలో, తుపత్రాల గ్రామంలో శిబిరం ఏర్పాటు చేస్తునట్లు పేర్కొన్నారు.

జీఎస్టీ రద్దు చేయాలని నిరసన



జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీని వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వ విధానాలపై సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాతబస్టాండులో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం పెట్టుబడి దారులకు లాభం చేకూరుస్తు నిర్ణయాలు తీసుకుంటుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఉప్పేరు నర్సింహ్మా, గజేంద్ర, రఘు, రాజేష్, కల్యాణ్, మౌలాలి తదితరులు ఉన్నారు.

మానవపాడు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గాంధీచౌక్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధనవంతులపై సంపద పన్ను వారసత్వం పన్ను విధించాలని ఉపాధిహామీ పథకానికి నిధులు పెంచాలని సూచించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తే ఆందోళనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ, రాజు, మాలిక్‌బాషా, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పౌరహక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్

మానవపాడు: పౌరహక్కుల ప్రతి ఒక్కరూ తప్పకుండా అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్ సూచించారు. మంగళవారం మండలంలోని చందూరులో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికి సమాన హక్కులు కల్పించిందన్నారు. కుల వివక్ష పాటిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రజానీకాంత్‌రెడ్డి, సర్పంచ్ నరసింహులు, పోలీస్‌లు, తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: మండలంలోని అమరవాయిలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవాన్ని సర్పంచు పద్మమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్ నర్సన్న, మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్, ఆర్‌ఐ నాగిరెడ్డిలు హాజరై మాట్లాడారు. రెండు గ్రాసుల పద్ధతి అవలంభిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కులవివక్ష పాటించడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, ఉప సర్పంచు సరోజ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలతో సృజనాత్మకత



గద్వాలలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



ధరూరులోని ఉప్పేరు ఉన్నత పాఠశాలలో

గద్వాల అర్బన్: పరిశోధనలతో సృజనాత్మకత పెరుగుతుందని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్ కుమార్ అన్నారు. మంగళవారం కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని సీవీ రామన్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్ పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని ఆయా పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా సీవీ రామన్ చిత్ర పటానికి హెచ్‌ఎం హరున్‌రషీద్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సైన్స్ ముగ్గులు, క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు సైన్స్ అంగ్ల అక్షరాల ఆకృతిలో కూర్చొని ఆకట్టుకున్నారు.

గట్టు: విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్‌లు ఉపయోగపడతాయని హెచ్‌ఎం జహీర్‌బేగ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆరగిద్ద ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకున్నారు. ముందుగా సీవీ రామన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టును ఉపాధ్యాయులు పరిశీలించారు.

ధరూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ఉప్పేరు, ధరూరు, రేవులపల్లి, జెన్‌కో డీఏవీ పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన బిందు సేద్యం, పెట్రోలు ఆదా, నీటి ఆదా, యాత్రిక శక్తి, మానవ శరీర భాగాలు తదితర ప్రయోగాలను ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తిలకించి అభినందించారు.

అయిజ: పట్టణంలోని న్యూ గీతాంజలి ఉన్నత పాఠశాలలో సైన్స్‌డే నిర్వహించారు. విద్యార్థులు సైన్స్‌పై వివిధ నమూనాలను ప్రదర్శించారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్, మైనార్టీ గురుకుల పాఠశాలలో సైన్స్‌డే సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన ప్రయోగాలను ప్రదర్శించారు. క్విజ్, సెమినార్ వివిధ పోటీలు ఏర్పాటు చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మానవపాడులోని చెన్నిపాడులో..



రామాపురంలో సైన్స్ డే ఆకృతిలో విద్యార్థులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని నది అగ్రహారం రోడ్డులో 132 కేవీ గద్వాల సబ్‌స్టేషన్ 33 కేవీ ఫీడర్ లైన్లు మరమ్మతు కారణంగా బుధవారం ఉదయం 6:30 గంటల నుంచి 9:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రమేష్ బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33 కేవీ ఫీడర్ల పరిధిలోని గద్వాల పట్టణంలోని పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, రాంనగర్, శేరెల్లీవీధి, గాంధీచౌక్, బీసీ కాలనీ, గంజిపేట, కొత్తపల్లిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఉప కేంద్రాలకు కూడ విద్యుత్ సరఫరాలో తాత్కాలికంగా అంతరాయం ఉంటుందని, రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

ఆధ్యాత్మికతతో ఆత్మవిశ్వాసం



మల్దకల్: ఆధ్యాత్మికతతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు చిన్న వీరేష్ అన్నారు. మంగళవారం మండలంలోని అడివిరావల్‌చెర్వులో ఆయన ఆచార్య ప్రబోధనంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక, త్రైతసిద్ధాంత గ్రంథాలను ప్రచారం నిర్వహించి మాట్లాడారు. అన్ని మతాల సారం ఒక్కటేనన్నారు. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తియోగ అధ్యాయనంలో శ్లోకాలు త్రైతసిద్ధాంతానికి ఆధారమన్నారు. కార్యక్రమంలో నర్సింహులు, భాస్కర్‌చారి, నరేషాచారి, విజయచారి, సూర్య, ఉదయ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలన అవినీతిమయం

శాంతినగర్: బీఆర్‌ఎస్ పాలనలో పూర్తిగా అవినీతిమయంగా మారిందని ఏఐసీసీ కార్యదర్శ సంపత్ కుమార్ ఆరోపించారు. వడ్డేపల్లి మండలంలోని జిల్లెడుదిన్నె, తిమ్మాజిపల్లి గ్రామాల్లో హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల ప్రజలతో మమేకమవుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలో కరెంట్ బిల్లుల మోత మోగుతుందని విమర్శించారు. అలంపూర్ పాలన అవినీతి, కమీషన్లతో రాజ్యమేలుతోందన్నారు. అక్రమ ఇసుక, మద్యం దందాలతో అధికార పార్టీ నాయకులు అక్రమ ఆస్తులు కూడబెట్టుకుంటున్నారన్నారు. ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్య, ఉపాధ్యాయ రంగాల్లో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న రాంచంద్రరావు

గద్వాలన్యూటౌన్: విద్య, ఉపాధ్యాయ రంగాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రరావు ఆరోపించారు. మంగళవారం స్థానిక డీకే బంగ్లాలో బీజేపీ బూత్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏవీన్ రెడ్డి విజయానికి పాటుపడాలని సూచించారు. జూనియర్ లెక్చరర్లు పదోన్నతులు కల్పించలేదని, పీఈటీ అప్‌గ్రెడేషన్ చేయలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడ్డం కృష్ణారెడ్డి, జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి బండల వెంకట్రాములు, అలంపూర్ ఇన్‌చార్జి కేకే రెడ్డి, మీర్జాపురం వెంకటేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్లు త్యాగరాజు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన ఏవీఎన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి కోరారు. మంగళవారం తపస్ నాయకులు పట్టణంలోని విద్యాసంస్థల్లో ఏవీన్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఉపాధ్యాయులను కోరారు. ఉపాధ్యాయులకు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పలువురు తపస్ నాయకులు పాల్గొన్నారు.

సైనికుడిలా పని చేయాలి

ధరూరు: ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా పని చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రాజేష్ అన్నారు. మంగళవారం మండలంలోని అల్వాలపాడు, కొత్తపాలెం గ్రామాల్లో బూత్ స్థాయి శక్తి కేంద్రం కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో కిష్టన్న, ప్రతాప్‌రెడ్డి, రాజు, హనుమంతరాయ, సురేష్, వేమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

కేటీదొడ్డి: పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జిల్లా అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు అన్నారు. మండలంలోని నందిన్నె, చింతలకుంట గ్రామాలలోని శక్తి కేంద్ర ఇన్‌చార్జులు నాగేష్, గురుస్వామి ఆధ్వర్యంలో మంగళవారం కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు మహదేవు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

గట్టు: మండలంలోని బల్గెర ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా ఐశ్వర్య, ఎంఈఓగా శైలజ, ఉపాధ్యాయులుగా చైతన్య, శశిరేఖ, విజయలక్ష్మి, రేణుక, మధుకుమార్ వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంఈఓ కొండారెడ్డి, హెచ్‌ఎం రంగన్న, ఉపాధ్యాయుడు శేఖర్‌లు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో విద్యార్థులు